ప్రజాశక్తి
మంగళవారం 9 ఏప్రిల్ 2024
1
విశాఖపట్నం
అనకాపల్లి







సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

కార్మిక నేతలను చట్టసభలకు పంపండి

- బిజెపితో అంటకాగిన వైసిపి, టిడిపి కూటమిలను ఓడించండి

- సిఐటియు విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్రనేత జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపిని, దానితో అంటకాగిన టిడిపి, జనసేన కూటమితోపాటు వైసిపిని చిత్తుగా ఓడించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు, విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కమిటీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. కార్మిక హక్కుల రక్షణ, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కార్మిక నాయకులను ఎన్నుకొని చట్టసభలకు పంపాలని కోరారు. నగరంలో కెఎం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సిఐటియు విస్తృతస్థాయి సమావేశంలో జగ్గనాయుడు మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను యాజమాన్యాల అనుకూలంగా నాలుగు లేబర్‌కోడ్స్‌గా మార్చేశారన్నారు., కార్మికులకు ఉద్యోగభద్రత, కనీస వేతనాలు అమలుకాకుండా యాజమాన్యాలకు బిజెపి వంతపాడుతోందన్నారు.

విభజిత ఆంధ్రకు తీవ్ర అన్యాయం చేసిన బిజెపితో తెలుగుదేశం, జనసేన పార్టీలు జత కట్టడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మేస్తానన్నా బిజెపితో కలిసిన వీరు, స్టీల్‌ప్లాంట్ రక్షణకు పోరాడతామనడం మరొకసారి కార్మికులు, ప్రజల్ని మోసం చేయడమేనన్నారు. బిజెపికి ఐదేళ్లపాటు అన్ని విధాలా సహకరిస్తూ వచ్చిన వైసిపిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. లోకనాథం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి. కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి. వెంకటరెడ్డి, పి.మణి, ఎస్. జ్యోతీశ్వరావు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు ఎన్.రామారావు, పలు కార్మికసంఘాల నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

మైసూర్ - భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణీకుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి, మైసూర్-భువనేశ్వర్ మధ్య ఒక ట్రిప్ ప్రత్యేక రైలును నడపాలని రైల్వే నిర్ణయించింది. 06215 మైసూర్, భువనేశ్వర్ ప్రత్యేక రైలు ఈనెల 9న మంగళవారంఉదయం 4.15 గంటలకు మైసూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 2.30 గంటలకు దువ్వాడ చేరుకుని, ఐదు నిమిషాల హాల్ట్ తర్వాత 2.35 గంటలకు బయలుదేరి అదేరోజు 10.40 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 06216 భువనేశ్వర్, మైసూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు, ఈనెల 10న బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు భువనేశ్వర్‌లో బయలుదేరి, రాత్రి 21.30 గంటలకు దువ్వాడ చేరుకుని, మరల 21.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 19.15 గంటలకు మైసూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు మాండ్య, బెంగళూరు సిటీ, బెంగళూరు కంటోన్మెంట్, కృష్ణరాజపురం, వైట్‌ఫీల్డ్, బంగారుపేట, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు మీదుగా ప్రయాణిస్తాయి.

విశ్వసనీయతలేని వారాహి యాత్ర

- సమస్యలపై పవన్ పిల్లిమొగ్గలు
- స్టీల్‌ప్లాంట్‌ను అమ్ముతున్న మోడీపై కానరాని విమర్శలు
- పిఎం దగ్గరకు రాలేదంటూ కార్మిక సంఘాలపై నింద

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనకాపల్లిలో ఆదివారం నిర్వహించిన వారాహి విజయభేరి యాత్రలో జిల్లా ప్రజల సమస్యల కంటే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన ప్రధాని మోడీని భుజానకెత్తుకొని మోయడానికే ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించింది. ప్రధాని దగ్గరకు వెళితే అమ్మకపు ప్రక్రియంతా ఆగిపోయేదన్నట్లు మాట్లాడారు. ప్రధానిని తిడితే లాభంలేదని అమ్మకానికి పెట్టిన ఆయన్ను వెనుకేసుకొస్తూ ప్లాంట్ పరిరక్షణ కోసం సుదీర్ఘంగా పోరాడుతున్న కార్మిక సంఘాలపై నిందమోపారు. ప్రధానితో సాన్నిహిత్యం వుందని గొప్పగా చెప్పిన పవన్ స్టీల్‌ప్లాంట్ అమ్మకం అపాలని, సొంత గనులు కేటాయించాలని ఎందుకు చెప్పలేదో ఆయన చెబితే బాగుండేది. స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై తన వైఖరి వెల్లడించకుండా సన్నాయి నొక్కులు నొక్కారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన బిజెపి తరుపున అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ఉన్న సిఎం రమేష్‌ను గెలిపించాలని నిస్సిగ్గుగా చెప్పడం జిల్లా ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు ప్రధానితో పవన్‌గానీ, రమేష్‌గానీ ప్రకటన చేయించగలరా ? సొంతగనులు కేటాయించగలరా ? ఆ శక్తి, చిత్తశుద్ధి వీరికి వుందా ? వుంటే ప్రకటన చేయించి నిరూపించుకోవాలని స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజలు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మొద్దని, సొంతగనులు కేటాయించి ఆదుకోవాలని రాజ్యసభలో ఏనాడూ మాట్లాడని రమేష్‌ను గెలిపించాలని ప్రజలను కోరడమంటే ప్లాంట్ అమ్మకాన్ని వేగవంతం చేసే అవకాశం ఇవ్వాలని అడిగినట్లుంది. కూటమి అధికారంలోకి వస్తే తుమ్మపాలను తెరిపిస్తామన్న ఆయన మూతపడ్డ ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల విషయాన్ని ప్రస్తావించలేదు. చోడవరం సుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణ ఊసేఎత్తలేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని ఎప్పటిలోగా



అనకాపల్లి పట్టణంలో వారాహి యాత్రలో అభివాదం చేస్తున్న పవన్

పూర్తిచేయనున్నారో చెప్పలేకపోయారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికావడం కోసమే మోడీని ఒప్పించి రమేష్‌ను అనకాపల్లి నుంచి పోటీచేయిస్తున్నట్లు మరో పెద్ద అబద్ధమాడారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికి నిధులు విడుదల కోసం రాజ్యసభ సభ్యునిగా ఆయన ఆరేళ్లలో చేసిన కృషేంటో పవన్ చెప్పలేదు. పోలవరం ప్రాజెక్టు, ఎడమ కాలువ పూర్తికాకుండా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తికాదన్న విషయం పవన్‌కు తెలిసినట్లులేదు.

పక్కనున్న అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ సరిదిద్దలేదు. కొణతాలను గెలిపిస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పుకొచ్చారు. అనకాపల్లి ఎంపీగా రెండుసార్లు, ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రిగా పనిచేసిన కొణతాల అనకాపల్లి పట్టణ ప్రజలను పట్టిపీడిస్తున్న దోమల బెడదకు శాశ్వతపరిష్కారం చూపలేకపోయారు. దాదాపు 120 ఏళ్ల చరిత్ర కల్గిన అనకాపల్లి మున్సిపాల్టీలో మురుగునీటి కాలువ వ్యవస్థలేక పట్ణణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పవన్‌కు పట్టినట్లులేదు. వారాహి యాత్ర.. యాత్రలా సాగింది తప్ప ప్రజలకు భరోసా ఇవ్వలేకపోయింది. నమ్మకం కలిగించలేకపోయింది.

మానసిక ఆరోగ్యం ముఖ్యం

సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రపంచ ఆరోగ్యసంస్థ నినాదానికి అనుగుణంగా మనిషికి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక, సామాజిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పిఎవి, పిపిసి ఆధ్వర్యంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో 'నా ఆరోగ్యం నా హక్కు' అంశంపై నిర్వహించిన సదస్సు ను ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు పివి సుధాకర్ ప్రారంభించారు. ప్రదానవక్తగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించే హక్కును భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 నిర్దేశిస్తోందన్నారు. ప్రజారోగ్యం, జీవించే హక్కుకు సంబంధించి పలు చట్టాలను వివరించారు. మరోవక్త డాక్టర్ పి.రామారావు మాట్లాడుతూ ఆరోగ్యరంగం ద్వారా వచ్చే పన్నులను ప్రభుత్వం ఆదాయ వనరుగా చూసుకుంటున్నప్పటికీ, ఆరోగ్యరంగం పురోగతిలోనే ఉందన్నారు.

స్వాతంత్ర్యానంతరం మనిషి సగటు ఆయుర్దాయం 35ఏళ్ల నుంచి 75ఏళ్లకు రెట్టింపునకు మించి పెరిగిందన్నారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కెఎన్ రాజు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకులు కెవిపి చంద్రమౌళిపాల్గొన్నారు.

ఉక్కుపై పవన్ తన వైఖరిని బహిర్గతం చేయాలి

- కార్మిక సంఘాలను కించపర్చేలా వ్యాఖ్యలు చేయడం సరికాదు

- సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి యాత్ర సందర్భంగా ఆదివారం అనకాపల్లిలో చేసిన ప్రసంగం స్పష్టతలేకుండా మరింత అయోమయం సృష్టించేదిగా ఉందని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయమై తన వైఖరిని వెల్లడించకుండా ప్లాంట్‌ను ప్రైవేటీకరించే మోడీని భుజాన్నెత్తుకొని మోస్తున్నట్లు పవన్ మాట్లాడారన్నారు. ప్రధాని దగ్గరికి రమ్మంటే కార్మిక సంఘాలు ఎవరూ రాలేదని చెప్పి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మిక సంఘాలపై నిందవేసేలా మాట్లాడడం సరైంది కాదన్నారు. మూడేళ్లుగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజల భాగస్వామ్యంతో ప్రజా సంఘాలు చేస్తున్న పోరాటాలు పవన్ కల్యాణ్‌కు కన్పించడంలేదా ? అని ప్రశ్నించారు. ప్రధాన మంత్రితో తనకు అత్యంత సాన్నిహిత్యం ఉందని చెప్పుకున్న పవన్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మొద్దని ఎందుకు చెప్పలేదని అడిగారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ పట్ల మోడీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నదీ, లేనిదీ పవన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌పై పార్లమెంట్‌లో మాట్లాడడానికి సిఎం రమేష్ లాంటి వ్యక్తులు ఉండాలని చెప్పడమంటే ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. ఏనాడూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, సొంత గనుల కేటాయింపుపై సిఎం రమేష్ మాట్లాడిన దాఖలాల్లేవని లోకనాథం గుర్తుచేశారు. జిల్లాలో ప్రధాన అంశాలను ప్రస్తావించకుండా విమర్శలకే పవన్ పరిమితమయ్యారని చెప్పుకొచ్చారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, సిపిఎస్ రద్దు వంటి అంశాలపై తన వైఖరిని వెల్లడించకుండా తప్పదాటు వైఖరిని ప్రదర్శించారన్నారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీకి గొంతుకోసింది టిడిపి ప్రభుత్వమేనని, మరలా టిడిపి కూటమి అధికారంలోకి వస్తే తెరిపిస్తామని చెప్పడం దగా చేయడం తప్ప మరొకటికాదని పేర్కొన్నారు. ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ విషయాన్ని కూడా పవన్ ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. అనకాపల్లి పట్టణ ప్రజలను పట్టిపీడిస్తున్న, వేధిస్తున్న దోమల సమస్యకు కారణమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కారంపై అసలు ప్రస్తావనే చేయకపోవడం పట్టణ ప్రజలను విస్మరించడమే అవుతుందన్నారు. చెరుకు రైతులకు మద్దతు ధర, ప్రోత్సాహక ధర చెల్లింపుల విషయంపై భరోసా ఇవ్వకుండా బెల్లానికి మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని చెప్పడంలో మోసం తప్ప చిత్తశుద్ధి లేదన్నారు. గత టిడిపి ప్రభుత్వ విధానాలతో ఏర్పడిన సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందని చెప్పడమంటే ప్రజలను మోసం చేయడం తప్ప మరొకటికాదన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఆడుతున్న నాటకాలను గుర్తించి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని లోకనాథం విజ్ఞప్తి చేశారు.

పవన్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : జనసేన అధినేత పవన్ కల్యాణ్ తమపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పోరాట కమిటీపై పవన్ చేసిన వ్యాఖ్యలు అర్ధరహితంగా, అసత్యాలతో ఉన్నాయన్నారు. తప్పుడు ప్రచారాలు మాని ఆంధ్రుల హక్కు అయన విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పవన్ పోరాట కమిటీని ప్రధాని వద్దకు తీసుకెళ్తామని ఏ రోజూ చెప్పలేదన్నారు.

84వ రోజుకు ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :తూర్పు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపి ఎంవివి సత్యనారాయణ నియోజకవర్గంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం 84వ రోజుకు చేరుకుంది. 20వ వార్డు లాసెన్స్ బే కాలనీ, పోస్టాఫీస్ జంక్షన్‌లో స్థానిక వార్డు కార్పొరేటర్ ముప్వల లక్ష్మి సురేష్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు.

మిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మహారాజా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (మిమ్స్) కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కె.ఎస్‌వి కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 65 రోజులుగా సమ్మె చేస్తున్నా కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా, వారిపై యాజమాన్యం నిర్బంధం ప్రయోగించడం దుర్మార్గమన్నారు. సమ్మెలో ఉన్న 17 మంది కార్మికులను, వారికి సంఘీభావం తెలిపిన సిఐటియు రాష్ట్ర, జిల్లా యూనియన్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయించి జైలుకు పంపడాన్ని సిఐటియు విశాఖ జిల్లా కమిటీ తరుపున తీవ్రంగా ఖండించారు. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకుని, మిమ్స్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, అరెస్ట్ చేసిన కార్మికులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయ పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందన్నారు.

జగదీశ్వరికి ఆంగ్లంలో డాక్టరేట్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆంగ్ల సాహిత్యంలో రచయిత్రి కావేరి నంబిసైన్ రాసిన నవలలపై ఆచార్య ప్రసన్నశ్రీ మార్గదర్శకంలో చేసిన అధ్యయనం చేసి సమర్పించిన థీసెస్‌కు చొక్కాకుల జగదీశ్వరి ఎయు పిహెచ్‌డి అందుకుంది. సోమవారం ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో జగదీశ్వరికి డాక్టరేట్ ప్రదానం చేశారు.



విజయవాడలో అవార్డు అందుకుంటున్న సత్యనారాయణరాజు

ఒక్క సినిమాతోనే అవార్డు

ప్రజాశక్తి- పద్మనాభం : తీసిన ఒక్క సినిమాతోనే రాజా సాగి సత్యనారాయణరాజు అవార్డు పొందారు. పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామానికి చెందిన రాజా సాగి సత్యనారాయణ రాజు తమ గ్రామంలోనే జన్మించిన అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రపై ఎంత ఖర్చు అయినా సినిమా తీయాలని నిర్ణయించుకొని 'ఒక్కడే వీరుడు- అల్లూరి సీతారామరాజు'ను చిత్రీకరించారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్‌లో ఉగాదిని పురస్కరించుకుని బెస్ట్ మూవీగా ఈ చిత్రాన్ని ఎంపిక చేశారు. విజయవాడలో ఆదివారం రాత్రి చిత్ర నిర్మాత రాజా సాగే సత్యనారాయణరాజుకు పిలిం ఛాంబర్ అధ్యక్షులు ఎంఎం.రత్నం అవార్డును అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మోహన్ గౌడు, సంయుక్త కార్యదర్శి విజయవర్మ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ జంక్షన్‌లో బొడ్డేటి కిరణ్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ప్రారంభించారు.కొత్త అమావాస్య సందర్భంగా నూకాంబిక అమ్మవారి పండగ నేపథ్యంలో 48వ వార్డు పలనాటి కాలనీలో జాగరపు అప్పారావు, గ్రామ పెద్దలు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన డ్రింక్స్‌ను పంపిణీ చేశారు. న్యూ శ్రీనివాసనగర్‌లో సిహెచ్.సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన మజ్జిగను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, బగతి విజయ్, బులుసు జగదీష్, నీలిరవి, వసంతల అప్పారావు, రేవతిరావు, కర్రి రామారెడ్డి, అంబటి శైలేష్ , పీలా అనురాగ్, రవిబాబు, శేషు, పాండవ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు బలోపేతానికి బిఎన్ఆర్ ఎనలేని కృషి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు



బిఎన్ఆర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కంచరపాలెం ప్రాంతంలో కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేసి, ధైర్యంగా కార్మిక సంఘాన్ని నడిపి సిఐటియును బలోపేతం చేసిన నాయకుడు బొట్టా నరసింగరావు అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన బొట్టా నరసింగరావు 20వ వర్ధంతిని కంచరపాలెంలోని బిఎన్ఆర్ భవనంలో సోమవారం నిర్వహించారు. నరసింగరావు చిత్రపటానికి, సిపిఎం సీనియర్ నాయకులు విఎస్.పద్మరాజు, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సిపిఎం సీనియర్ నాయకులు ఎస్. సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, బొట్టా నర్సింగరావు ఆంధ్ర స్టీల్ కంపెనీలో పనిచేసేవారన్నారు. బ్రిటిష్ వారికన్నా అతి భయంకరంగా నిర్వహణ ఉండే ఆ కంపెనీలో సిఐటియును నర్సింగరావు ఏర్పాటుచేసి కార్మికులకు అండగా నిలబడ్డారన్నారు. కంచరపాలెం జోన్‌లో అనేక ప్రజా సంఘాలు నిర్మించడంలో ముఖ్యమైన పాత్ర పోషించారన్నారు. సిపిఎం కార్పొరేటర్‌గా ప్రజా సమస్యలపై పనిచేశారన్నారు. నర్సింగరావు భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు విఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్న మతోన్మాద బిజెపిని, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాల అనుసరిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ఓడించాలని, దేశాన్ని అమ్మేస్తున్న బిజెపికి మద్దతుస్తున్న టిడిపి, జనసేన కూటమిని ఓడించాలని, ఈ నాలుగు పార్టీలను వ్యతిరేకించే ఇండియా కూటమిని బలపరిచాలని పిలుపునిచ్చారు. గాజువాక నియోజకవర్గంలో సిపిఎం పోటీ చేస్తుందని, గెలిపించాలని కోరారు. బిఎన్ఆర్ ఫౌండేషన్ నాయకులు ఎస్.అప్పలరాజు బిఎన్ఆర్ భవనంలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ, సిఐటియు జోన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.సింహాచలం, ఒ.అప్పారావు, సీనియర్ నాయకులు పి.రామారావు, జి.సూర్య చంద్రరావు, ఎస్.రాంగోపాల్, ఎస్.శ్రావణ్, ఎం.ఈశ్వరరావు, పుష్ప, సిహెచ్ కమల, ఎం.జయలక్ష్మి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపులో రాయితీ

ప్రజాశక్తి -వేపగుంట : జివిఎంసికి చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు ఏక మొత్తంలో ఈ నెల 1 నుంచి 30వ తేదీలోగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు జోన్-8 కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేపగుంట జోనల్ కార్యాలయంలోని సౌకర్యం కేంద్రం కౌంటర్లు ఈ నెలాఖరు వరకు సెలవు దినాలలో కూడా పనిచేస్తాయని పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 5 శాతం రాయితీని పొందాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెంలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశ్చిమబెంగాల్ అలిపూర్ గ్రామానికి చెందిన పరిమెల దేవనాధ్ ఏడాదిక్రితం నుంచి బొడ్డపాలెంలో అద్దె ఇంట్లో ఉంటూ వెల్లంకి రాయల్ ప్లేవుడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతనికు భార్య పింకీసాహా, ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. దేవనాద్ మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య పింకీ సాహ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ శివ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసును సిఐ టీవీ.తిరుపతిరావు ఆధ్వర్యాన పిసి ఎస్.ధనలక్ష్మి దర్యాప్తు చేపట్టారు.

800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పాతకృష్ణదేవిపేట గ్రామ సరిహద్దుల్లో నాటు సారా తయారు చేసేందుకు ఉపయోగించే 800 లీటర్ల బెల్లపు పులుపును ధ్వంసం చేశామని కేడిపేట ఎస్సై ఎం.ఉపేంద్ర సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఎవరైనా నాటు సారా తయారీ, విక్రయాలు చేసినా అటువంటి వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ చిరంజీవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాడిలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం తమ సిబ్బంది దాడి చేసి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు కఠినంగా తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తిగత దూషణలు తగవు

ప్రజాశక్తి -సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజుపై మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు వ్యక్తిగత దూషణలకు పాల్పడటం మంచి పద్ధతి కాదని డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్ హితవు పలికారు. సీతమ్మధారలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంచి వాతావరణంలో ప్రచారం జరగాలన్నారు. 2014 నుంచి 2019 వరకు విష్ణుకుమార్‌రాజు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని, 2019 నుంచి 2024 వరకు ఓడిన కెకె.రాజు చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో ఇళ్ల కాంట్రాక్టులు పొంది ఉత్తర నియోజకవర్గంలో ఒక ఇల్లు కూడా కట్టని విష్ణుకుమార్ రాజు ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. హుందాతనంతో నడుచుకోవాలని, లేకుంటే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు మాట్లాడుతూ, ఉత్తర నియోజకవర్గంలో కెకె.రాజు చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, అనిల్ కుమార్‌రాజు, శ్రీను, అల్లు శంకర్రావు, పద్మారెడ్డి, చల్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఉచ్చులో పడి వాలంటీర్లు చులకన కావొద్దు

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి నాయకుల ఉచ్చులో పడి వాలంటీర్లు ప్రజల్లో చులకన కావద్దని జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. సోమవారం గాజువాకలో జరిగిన టిడిపి కార్పొరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు చెల్లిస్తున్న పన్నుల ద్వారా జీతాలు తీసుకుంటున్న వాలంటీర్లను వైసిపి తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం దారుణం అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు మెచ్చే విధంగా వాలంటీర్ల సేవలను వినియోగిస్తామని తెలిపారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను గౌరవించి వాలంటీర్లు, డ్వాక్రా ఆర్‌పిలు మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో 87వ వార్డు కార్పొరేటర్ బోండా జగన్, 67 వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, 75వ వార్డు ఇన్‌ఛార్జి పులి వెంకటరమణారెడ్డి, పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉగాది సంబరాల్లో మాట్లాడుతున్న సెక్రటరీ వి.రామారావు

ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో ఉగాది సంబరాలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీ వి.రామారావు మాట్లాడుతూ, తెలుగువారికి ఉగాది నుంచి కొత్త సంవత్సరం ప్రారంభం అవుతుందన్నారు. ఈ ఏడాదిలో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఉగాది ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

'విజయం' ఉగాది ఉత్సవం

ప్రజాశక్తి -పిఎం పాలెం : విజయం స్కూల్ ఆధ్వర్యాన సోమవారం ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యాన చేపట్టిన ఉత్సవాలకు ముఖ్య అతిథిగా విశాఖపట్నం కూచిపూడి కళాక్షేత్రం వ్యవస్థాపక దర్శకులు కళారత్న ఎబి.బాల కొండలరావు, విశిష్ట అతిథులుగా అసోసియేట్ ప్రొఫెసర్ ఫైన్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ హెచ్ఒడి (గీతం) డాక్టర్ కొండుపర్తి మాల్యద, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫైన్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం గీతం అనుకూల ఆనంద శ్రీహరి, జాతీయ అవార్డు గ్రహీత తబలా ఆర్టిస్ట్ ఆల్ ఇండియా రేడియో ఎ గ్రేడ్ ఆర్టిస్ట్ డి.ధనంజయ, కొరియోగ్రాఫర్ కూచిపూడి ప్రదర్శకుడు ఆదిత్య అనుకూల హాజరయ్యారు. తెలుగు నూతన సంవత్సర ప్రారంభం గొప్పతనం, పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, సంప్రదాయ నృత్యాలతో విజయం చిన్నారులు అలరించారు. ప్రముఖ తబలా కళాకారులు ధనుంజయ్, ఆనంద విహారి బృందం సంగీత విభావరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ముఖ్య అతిథులకు స్కూల్ యాజమాన్యం ఉగాది పురస్కార అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించింది.

విస్తృతంగా ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- తగరపువలస : వైసిపి భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం జివిఎంసి ఒకటో వార్డు పరిధి బాలాజీనగర్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, పార్టీ వార్డు అధ్యక్షులు జగుపిళ్ల ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు జివి రమణ, ఉప్పాడ నాగేశ్వరరావు, నాయకులు అక్కరమాని చినబాబు, పందిరి విజయ్ తదితరులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరుగు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ లోక్‌సభ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముద్రించిన బ్రోచర్లను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. బాలాజీనగర్ వార్డు సచివాలయం పరిధిలో ఐదేళ్ల కాలంలో రూ.కోటీ 35 లక్షల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ.26 కోట్ల సంక్షేమ పథకాలు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



బాలాజీనగర్‌లో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పెద్దిపాలెంలో కూటమి విస్తృత సమావేశం

18న భారీ ర్యాలీతో నామినేషన్
టిడిపి అభ్యర్థి గంటా వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెం చెన్నా ఫంక్షన్ హాల్ సోమవారం టిడిపి, బిజెపి, జనసేన కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యాన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, 10వ తేదీన అన్నవరం గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తామని, 18న నామినేషన్ దాఖలు చేస్తామని తెలిపారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి టిడిపి 80 శాతం పూర్తి చేసిన పోలవరాన్ని ఐదేళ్లలో 4 శాతం కూడా పూర్తి చేయలేదని, ప్రత్యేక హోదా, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, రైల్వే జోన్ వంటి అంశాలను గాలికి వదిలేశారని విమర్శించారు. ఐదేళ్లలో ఒక్క కొత్త పరిశ్రమనైనా తీసుకు రాలేకపోయారన్నారు. మద్య నిషేధంపై మాట తప్పిన జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు ప్రజలంతా నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజు, జనసేన భీమిలి ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల, టిడిపి జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, మాజీ ఎమ్మెల్యే కర్రి రాము, బిజెపి అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.

మన విధానం.. మత సామరస్యం..

భీమునిపట్నం : మన విధానం.. మత సామరస్యం అని భీమిలి టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలిలో మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లిములనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, 2014 – 19 మధ్య కాలంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు ముస్లిముల సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని గుర్తు చేశారు. కులం, మతం, ప్రాంతం ఏదైనా ముందు మనమంతా మనుష్యులమని నొక్కి చెప్పారు. మే 13న జరుగు ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు షేక్ అన్వర్ హుస్సేన్, షేక్ హుస్సేన్, మొహమ్మద్ ఖాజా, షేక్ అబ్దుల్ నయీం, అబ్దుల్ గని తదితరులు పాల్గొన్నారు. ముందుగా గంటా రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే గ్రౌండ్‌లో కెకె.రాజు ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : రైల్వే న్యూ కాలనీలోనిరైల్వే గ్రౌండ్‌లో ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు సోమవారం ప్రచారం నిర్వహించారు. వాకర్స్, క్రీడాకారులతో మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 'ఫ్యాన్' గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ, క్రీడలపై మక్కువ పెంచుతూ అనేక క్రీడా కార్యక్రమాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆళ్ళ లీలావతి, కెవిఎన్ శశికళ, నాయకులు భాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, రాయుడు శ్రీను, నూకరాజు, సకలబత్తుల ప్రసాద్, అమర్‌రెడ్డి, గంగ మహేష్, హరి పట్నాయక్, ఠాగూర్, బి.గోవింద్, అంబటి శైలేష్, మహదాస్య గోపి, శ్రీనివాస్‌రెడ్డి, జె.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



రైల్వే స్టేడియంలో ప్రచారం చేస్తున్న కెకె.రాజు

గోపాలపట్నంలో వైసిపి ఎన్నికల ప్రచారం



గోపాలపట్నంలో ప్రచారం నిర్వహిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి- గోపాలపట్నం : గోపాలపట్నం పరిసర ప్రాంతాలలో వైసిపి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించింది. జివిఎంసి 92వ వార్డు పరిధి బాపూజీనగర్, శ్రీనుబాబునగర్‌లలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్, జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, నాయకులు, కార్యకర్తలు కలిసి గడపగడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటినీ సందర్శించి సమస్యలనడిగి తెలుసుకున్నారు. పేదలకు సంక్షేమ పథకాలను అందించిన వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. 92వ వార్డు పరిధి బాపూజీనగర్‌లో నూకాలమ్మవారిని దర్శించుకున్నారు. గోపాలపట్నం ప్రధాన రహదారిలో నూకాలమ్మ పండగ సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆనంద్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామినాయుడు, బురెడ్డి గోపి, కన్వీనర్లు, గృహ సారథులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

NOTICE
IN THE HON'BLE COURT OF CIVIL JUDGE (JUNIOR DIVISION) YELLAMANCHILI
O.S.173/2019

Between:
Kuchi Surya Durga Dattatreya
...Plaintiff
And
Vakada Padmavathi
...Defendant
To:
Defendant:-
Vakada Padmavathi, W/o Krishna
Door No.39-8-21/12, Murali Nagar,
Visakhapatnam-7

That the plaintiff was filed a suit against you i.e., above Defendant for recovery of suit amount. In the above matter you avoiding service of Summons through court and R.P. some how or other hence as per the orders of the Honble court this public notice. Therefore take notice that you should appear in person or through Advocate **on 22-04-2024 at 10.30 A.M** before the Hon'ble Civil judge (JUNIOR DIVISION), Yellamanchili failing which an order will passed against you, setting you ex-parte.

Srinivasa Patnaik
Advocate for Plaintiff
Yellamanchili
Dt. 08-04-2024

NOTICE
IN THE HON'BLE COURT OF CIVIL JUDGE (JUNIOR DIVISION) YELLAMANCHILI
I.A.979/2019 O.S.173/2019

Between:
Kuchi Surya Durga Dattatreya
...Petitioner
And :
Vakada Padmavathi
...Respondent
To :
Defendant:-
Vakada Padmavathi,
W/o Krishna
Door No.39-8-21/12, Murali Nagar,
Visakhapatnam-7

That the petitioner was filed a suit against you i.e., above Respondent for recovery of suit amount. In the above matter you avoiding service of Notices through court and R.P. some how or other hence as per the orders of the Honble court this public notice issued. Therefore take notice that you should appear in person or through Advocate **on 22-04-2024 at 10.30 A.M** before the Hon'ble Civil judge (JUNIOR DIVISION), Yellamanchili failing which an order will passed against you, setting you ex-parte.

Srinivasa Patnaik
Advocate for Petitioner/Plaintiff
Yellamanchili
Dt. 08-04-2024


కాలిపోయిన జీడి తోటలు

ఆరు ఎకరాల జీడి తోటలు దగ్ధం

- రూ.10 లక్షల వరకు నష్టం

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం, ఎల్.సింగవరం గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మాజీ సర్పంచ్ కరణం కాసులమ్మకు చెందిన ఆరు ఎకరాల జీడి మామిడి తోటలు పూర్తిగా దగ్ధమయ్యాయి. జీడి మామిడి తోటలకు అనుకొని విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఎండ తీవ్రంగా ఉండటం వలన గాలిలో విద్యుత్ వైర్లు రాపిడికి మంటలు చెలరేగి కింద ఉన్న జీడి మామిడి తోటల్లోకి నిప్పులు పడటంతో మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు రావికమతం అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అయితే అగ్నిమాపక సిబ్బంది వచ్చే సరికి జీడి మామిడి తోటలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. సుమారు పది లక్షల వరకు ఆస్తి నష్టం కలిగి ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. స్థానిక బాధితురాలని టిడిపి చోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ బత్తుల తాతయ్యబాబు పరామర్శించి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరికొద్ది రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో ఇలా జీడి మామిడి తోటలు పూర్తిగా దగ్ధం కావడంపై బాధిత కుటుంబం పట్ల లబోదిబోమంటున్నారు.

డైట్ కళాశాల ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి డైట్ కళాశాల ఎన్ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవరం అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. దీనిని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంలో రత్నాకర్ మాట్లాడుతూ సూర్యుని తాపం నుండి ఉపశమనం కోసం మజ్జిగ పంపిణీ చేస్తున్నామని, అనకాపల్లి చుట్టుపక్కల ఉచితంగా కూలింగ్ వాటర్ పంపిణీ కూడా ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ బి. సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ఫార్మసిటీలో గల ఆల్కలీ మెటల్, ఎక్టోరియా రెండు పరిశ్రమల్లో ఆదివారం జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పరవాడ ఫార్మసిటీలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ యాజమాన్యాలు భద్రత ప్రమాణాలు పాటించకపోవడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఆదివారం జరిగిన ఈ రెండు ప్రమాదాలపై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, భద్రతా ప్రమాణాలు తీసుకొనే విధంగా ఆదేశించాలని డిమాండ్ చేశారు. భద్రత ఆడిట్ అన్ని పరిశ్రమల్లో నిర్వహించాలన్నారు. ప్రమాదాల కారణమైన యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఎక్టోరియా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో కన్నుకు తీవ్ర గాయమైన వ్యక్తికి చూపు కనిపించేలా మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.రమణ, ఎం.మసలి నాయుడు, జి.చిట్టిబాబు, కె.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఫార్మాసిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

క్షతగ్రాత్రులకు గనిశెట్టి పరామర్శ

ఫార్మాసిటీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికులను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఏ విధంగా వైద్యం అందుతుందీ ఆరా తీశారు. అస్వస్థతకు గురైన కార్మికులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్య కాలమంతా జీతం చెల్లించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

జిల్లా సమస్యలపై జనసేన వైఖరేంటి ?

పవన్ కల్యాణ్ దాటవేత దోరణిని ఖండించిన సిపిఎం మండల కమిటీ

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లిలో ఈనెల 7న జరిగిన జనసేన పార్టీ బహిరంగ సభలో ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఈ ప్రాంత సమస్యలపై స్పష్టమైన వైఖరిని ప్రకటించకుండా దాటవేత ధోరణి ప్రదర్శించడాన్ని సిపిఎం అనకాపల్లి మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, నాయకులు బొప్పే ఉమామహేశ్వరరావు, కాళ్ళ తేలయ్యబాబు విలేకర్లతో మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని చెబుతోందని, దీనికి జనసేన వ్యతిరేకమా? అనుకూలమా? అనేది స్పష్టం చేయాలన్నారు. ఎపికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర అభివృద్ధి నిధులు వంటి విభజన హామీలను బిజెపి ప్రభుత్వం విస్మరించిందని పేర్కొన్నారు. వీటిపైనా, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి తద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా నీరు అందించే విషయంపైనా పవన్ కల్యాణ్ మాట్లాడకపోవడం విచారకరమన్నారు. ప్రశ్నిస్తా! ప్రశ్నిస్తా! అన్న పవన్ కల్యాణ్ కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడాన్ని ఏమని అర్థం చేసుకోవాలన్నారు. అనకాపల్లిలో దోమలు సమస్య, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, ల్యాండ్ పూలింగ్ వంటి వాటిపైనా పవన్ మాట్లాడలేదన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ప్రకటించకుండానే న్యాయం చేస్తానని చెప్పడం ఉద్యోగులను మోసగించడమే అవుతుందన్నారు. పవన్ వైఖరి డొంక తిరుగుడు వ్యవహారంగా ఉందన్నారు. ఇప్పటికైనా జనసేన పార్టీ ఈ ప్రాంతం కోసం ఏం చేస్తుందో ఒక స్పష్టమైన ప్రణాళికను ప్రకటించాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్


కవి సమ్మేళనంలో పాల్గొన్న సాహితీ మిత్రులు

ఉగాదిని పురస్కరించుకొని కవి సమ్మేళనం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని సోమవారం కవి సమ్మేళనం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన గొంతిన రంగబాబు మాట్లాడుతూ ఉగాది కవుల పండగని, ప్రకృతిలో కోయిలలు చెప్పే స్వాగతంలా కవి కోయిలలూ ఈ పండగను స్వాగతిస్తాయని చెప్పారు. ప్రతి ఏటా కవి సమ్మేళనం, కవి సత్కారం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. కవులు, రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో మార్పునకు శ్రీకారం చుట్టాలన్నారు. తెలుగు భాషను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయంలో కవులు ఉగాది సంబరం జరుపుతున్నందుకు ఆత్మీయ అతిథి లైబ్రేరియన్ కె.శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సీనియర్ కవి మాధవీసనారా ఆధ్వర్యంలో రసవత్తరంగా కవిసమ్మేళనం జరిగింది. పలువురు కవితలు, పద్యాలు, పాటలు వినిపించారు. అనంతరం కవులు, కవయిత్రులును అనకాపల్లి సాహితీమిత్రులు సత్కరించారు. కార్యక్రమంలో కవులు కోరాడ అప్పలరాజు, వజ్రపు త్రినాథరావు, గంపా శ్రీదేవి, బుద్ధ వీరునాయుడు, కెఎన్ఇ.శ్రీనివాసరావు, జిఎస్‌కె.సాయిబాబా పాల్గొన్నారు.

పండగ పూటా పస్తులేనా?

గోపాల మిత్రల సంఘం అధ్యక్షులు కిశోర్ ఆవేదన

ప్రజాశక్తి- సబ్బవరం : పశుసంవర్ధక శాఖ పరిధిలో పనిచేస్తున్న రాష్ట్రంలో ఉన్న గోపాల మిత్రులను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ పండుగ పూట పస్తులు ఉంచుతోందని మండల గోపాల మిత్రల సంఘం అధ్యక్షుడు జి.కిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సంఘం నాయకులు మాట్లాడుతూ గోపాల మిత్రలకు ప్రభుత్వం ప్రతి నెల ఇవ్వాల్సిన గౌరవ వేతనం రూ.6500 ఆరు నెలల నుండి చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాలుగా పాడి రైతులకు సేవలు అందిస్తున్న తమకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇచ్చిన రూ.6500 గౌరవేతనం తప్ప, వైసీపీ ప్రభుత్వం తమకు ఏమీ చేయలేదని పేర్కొన్నారు. గోపాల మిత్ర వ్యవస్థను చంద్రబాబు ఏర్పాటు చేశారనే, దురుద్దేశంతో వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో పశు సహాయకులను ఏర్పాటు చేసి తమను మెడ పట్టి గెంటే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3000 మంది గోపాల మిత్రులు న్యాయ స్థానాన్ని ఆశ్రయించి ఉద్యోగం నిలుపుకున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే తమపై వివక్ష కారణంగానే ఆరు నెలలుగా రావాల్సిన గౌరవేతనం ఇవ్వకుండా ప్రభుత్వం నూతన సంవత్సరం పూట తమ పిల్లా, పాపలను పస్తులు ఉంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

తురకలపూడిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట
ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని తురకలపూడి పిహెచ్‌సిలో డాక్టర్ సంధ్యారాణి సోమవారం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన 350 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్యారాణి

ఘనంగా నూకాలమ్మ జాతరలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కొత్త అమావాస్యను పురస్కరించుకొని అనకాపల్లి, విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల్లో నూకాలమ్మ అమ్మవారి పండగలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కె.కోటపాడు : కె.కోటపాడు మండలంలోని గొండుపాలెం, చౌడువాడ, దాలివలస, కె.కోటపాడు, కొరువాడ తదితర గ్రామాల్లో నూకాంబిక అమ్మవారికి ఉదయం నుండే పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. గొండు పాలెం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో మహిళల కోలాటం ప్రదర్శన ఏర్పాటు చేశారు. మాడుగుల నియోజకవర్గం టిడిపి, వైసిపి అభ్యర్థులు పైలా ప్రసాదరావు, ఈర్లె అనురాధలు పలు గ్రామాల్లో నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దాలివలసలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం వడ్డాది, పెదపూడి, కేపీ అగ్రహారం గ్రామాల్లో నూకాంబిక ఆలయాలు వేకువ జాము నుండి రద్దీగా కనిపించాయి. క్యూ లైన్లు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీర, పసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కేపీ అగ్రహారంలో జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు నగదు పురస్కారం అందించారు. ఆదివారం రాత్రి కేపీ అగ్రహారంలో ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన భక్తులను అలరించింది.

మునగపాక : మండల కేంద్రం మునగపాకలో ఆదివారం రాత్రి నూకాంబికా అమ్మవారి ఘటాల ఊరేగింపు ఘనంగా జరిగింది. స్థానిక నూకాంబిక ఆలయం వద్ద సోమవారం భక్తులు బారులు తీరి అమ్మవారికి చీర, సారెలు సమర్పించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నెలరోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలతకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ చైర్మన్ మల్ల రామజగన్నాథం తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, దిమ్మల నూకరాజు, పెంటకోట సన్యాసినాయుడు, మల్ల జగప్పారావు, పీల రామారావు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఎఎస్.పేట, ఎన్.జి.పాలెం, నర్సింగబిల్లి, ఉగ్గినపాలెం, కసింకోట తదితర గ్రామాలలో నూకంబిక అమ్మవారి ఉత్సవాలు జరిగాయి. అనకాపల్లి నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ పలు గ్రామాల్లో నూకంబిక అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగ లక్ష్మీ గున్నయ్య నాయుడు, సర్పంచులు నూక రత్నం నాయుడు , నాగమణి, గణేష్, కొన అరుణ, నాగేశ్వరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ, ఏ.కొత్తపల్లి, మామిడిపల్లి, కాశీపురం తదితర గ్రామాలలో సోమవారం నూకంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని ఏ కొత్తపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి గుర్రపు పరుగు పందాలు రసవత్తరం సాగాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో గుర్రాలు పాల్గొన్నాయి. విజేతలకు భారీగా నగదు బహుమతులను సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ అందజేశారు. ఎం.అలమండలో జిల్లాస్థాయి ఎడ్ల బళ్ళు పరుగు ప్రదర్శన జరిగింది. మామిడిపల్లిలో జిల్లాస్థాయి కోలాట పోటీలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నూకాంబిక అమ్మవారి పండగ ప్రారంభం

అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు, అనకాపల్లి గవరపాలెంలో పాలెం శ్రీనూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి, కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో. ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 7 నుండి మే 7వ తేదీ వరకు నెలరోజుల పాటు అమ్మవారి కొత్త అమావాస్య ఉత్సవాలు జరగనున్నాయి.


అనకాపల్లి నూకాంబిక అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని పెదనాయుడుపాలెం కొత్త రోడ్డులో గల నూకాంబిక అమ్మవారి ఆలయానికి స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పూజలు నిర్వహించారు. గుల్లేపల్లి గ్రామంలో స్థానిక ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు దంపతులు, సర్పంచ్ బండారు మంగ శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన కార్యక్రమాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు సోదరులు వెంకటేశ్వరావు మండలంలో పెదనాయడుపాలెం నాకాలమ్మ తల్లిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు బర్ల రమణ, పల్లా తాతారావు, మారేడుపూడి అక్కుబాబు, చింతల శ్రీను, కర్రి గోవిందు, కర్రి సత్యనారాయణ, జొన్నాడ రేణుక, బోండా రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

నక్కపల్లి : కొత్త అమావాస్యను పురష్కరించుకుని మండలంలోని ఉపమాక గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామంలో నూకాలమ్మ ప్రతిమలు (గరగలను) డప్పుల వాయిద్యాలతో ఊరేగించారు. పెద్ద ఎత్తున బాణా సంచాలు పేల్చారు. సోమవారం ఉదయం తాటి చెట్ల పేడలను పాతి వాటికి తాడుకట్టి ఊయలను తయారుచేసారు. ఈ ఊయలపై అమ్మవారి ప్రతిమలను (గరగలను) కూర్చొండబెట్టి ఊయల ఊపుతూ, పాటలు పడుతూ ఈ కార్యక్రమాన్ని ఎంతో సందడిగా గ్రామపెద్దలు, యువకులు నిర్వహించారు. అనంతరం రామాలయం ఎదుట వున్న ఖాళీ ప్రదేశంలో నీళ్ళతో శుభ్రంగా నేలను తడిపి కట్టెలతో నాగళి (ఏరులు) తయారు చేసి చిన్నారులతో నాగళి లాగించి దుక్కు దున్నే తంతు నిర్వహించారు. ఇలా చేయడంతో కొత్త సంవత్సరంలో వర్షాలు సకాలంలో పడి పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయని పెద్దల నమ్మకం. ఈ ఆచారాన్ని ప్రతీ ఏడాది ఉగాది ముందు రోజున ఉపమాక రామాలయం వద్ద చేయడం ఆనవాయితీగా వస్తుంది.


నక్కపల్లి : మండలంలోని గ్రామాల్లో సోమవారం నూకాలమ్మతల్లి పండుగను భక్తులు భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. కొత్త అమావాస్య సంధర్భంగా నూకాలమ్మ జాతర కోసం మండలంలో పలు గ్రామాల్లో అమ్మవారి ఆలయాలను అందంగా ముస్తాబు చేసారు. నక్కపల్లి, ఉపమాక, రాజయ్యపేట, పెదతీనార్ల, అమలాపురం, డి.ఎల్.పురం, రమణయ్య పేట, ఎన్.నర్సాపురం, బంగారమ్మపేట, గొడిచెర్ల, డొంకాడ, దేవవరం తదితర గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. రాజయ్యపేటలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోటవురట్ల : మండల వ్యాప్తంగా సోమవారం కొత్త అమావాస్యను పురస్కరించుకొని నూకాలమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటవురట్ల, కైలాస పట్నం, రాజుపేట, గొట్టువాడ, సుంకపూర్, జల్లూరు, పందూరు, వెంకటాపురం, పాములవాక గ్రామాలలో ఆలయాల వద్ద మహిళలు బారులు తీరారు. కైలాస పట్నంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.

చీడికాడ : మండలంలో కొత్త అమావాస్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన నూకాలమ్మ ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నూకాలమ్మ ఘటములను ఊరేగించారు.

గొలుగొండ : మండలంలోని లింగంపేట గ్రామంలో నూకాలమ్మ జాతర మహోత్సవం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నుంచి 9 రోజులు జరగను న్నాయి. ఆదివారం రాత్రి జరిగిన తొలి జాగారంను విద్యుత్ దీపాల అలంకరణ మధ్యలో ఉత్సవ కమిటీ ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలతో ఘటాలను ఊరేగించారు.

ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధి దుగ్గపువానిపాలెంలో నూకాలమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలాభిషేకాలు, పసుపు కుంకమ అభిషేకాలు చేశారు. డప్పులు, మందుగుండు సామాగ్రితో అంగరంగ వైభవంగా పండగను జరిపారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి గ్రూప్ ఆఫ్ చైర్మన్ సిగిలిపల్లి రవి, కొన్న ఎర్రన్న, ప్రగఢ అప్పలనరసయ్య, డివి.అప్పారావు, బి.అప్పలసత్యం, డి.దానప్పలు, అప్పిని సన్యాసిరావు, గ్రామస్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.


దుగ్గపువానిపాలెంలో సిగిలిపల్లి రవి తదితరులు



దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లిలో గుర్రపు పందేలు నిర్వహిస్తున్న దృశ్యం

పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి వేలంపేట, 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురం, 94వ వార్డు పరిధి గంగిరెడ్డి కాలనీల్లో ఉన్న నూకాంబిక ఆలయాలకు అమావాస్య పురస్కరించుకొని సోమవారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచీ భక్తులు అమ్మవారికి పసుపుకుంకుమలతో మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన పలుచోట్ల అన్న సమరాధన నిర్వహించారు.

ములగాడ : జివిఎంసి 40వ వార్డు అధ్యక్షులు గుండపు నాగేశ్వరరావు, 63 వార్డు అధ్యక్షులు సోమాదుల సురేష్, ఇన్చార్జ్ పిలక రామ్మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ ఆధ్వర్యాన నూకాలమ్మ పండగ నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 74వ వార్డులోని శ్రీస్వర్ణ నూకాంబిక అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వెంపలినగర్‌లోని నూకాలమ్మతల్లిని దర్శించుకుని ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ సాయిరాం, గంధం సాయి, సికు రమణ, డాక్టర్ ఎస్.రాజారావు, రామసూరి, సాంబశివ, దాడి సంతు, చిన్ని పాల్గొన్నారు.

భీమునిపట్నం : గ్రామ దేవత నూకాలమ్మ ఉత్సవం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి బి.మురళీ మోహన్ పర్యవేక్షణలో వివిధ ఆలయాల సిబ్బంది సేవలు అందించారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. కీర్తిశేషులు కట్టమూరి ఆనంద్ కుమారులు ఆర్థిక సాయంతో ఏటా మాదిరిగానే పులిహోర, అన్నవరం సత్య నారాయణ స్వామి ప్రసాదం, తాగు నీరు పంపిణీ చేశారు. అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ కదిరి జగన్నాథం ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కె.ఎల్లాజీ పాల్గొన్నారు. జివిఎంసి ఒకటో జోన్ ఆధ్వర్యాన తాగు నీటి సదుపాయం కల్పించారు.

ప్రకృతి పండుగ.. ఉగాది!

శ్రీక్రోధి ఆగమనం నేడే!

మనిషికి, ప్రకృతికి ప్రాథమికంగా ఉన్న అనుబంధాన్ని చాటి చెప్పేవే పండుగలు. ఆది నుంచీ మనిషికి బతుకు పాఠాలను విడమర్చి చెప్పే గురువు, ఆకలి తీర్చే ఆదరువు ప్రకృతియే. ప్రతి పండగలోనూ మనిషికి ప్రకృతితో ముడిపడి ఉన్న అనుబంధం కనిపిస్తుంది. అలా చూసినప్పుడు ఉగాది అక్షరాలా ప్రకృతి పండగ. ఉగాది వేళ పల్లవించే ప్రతి మార్పులోనూ మనిషి జీవితానికి అన్వయించే పాఠం ఒకటి అంతర్లీనంగా ఇమిడి ఉంటుంది. పరికించే చూస్తే... ఉగాది జీవితాన్ని నిర్వచించే పండుగ. జీవితాన్ని నిర్మించే పండుగ. శోభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, శ్రీక్రోధి తెలుగు సంవత్సరానికి ఆహ్వానం పలికే వేళ ఉగాది విశిష్టతను ఓసారి పరికిద్దాం.

(ప్రజాశక్తి - విశాఖపట్నం)

జీవిత పరమార్థాన్ని తెలియజెప్పే ఉగాది పచ్చడి

ఆరు రుచుల సమ్మేళనంగా అలరించే ఉగాది పచ్చడి జీవిత పరమార్థాన్ని విడమర్చి చెబుతుంది. సుఖదు:ఖాలు, కోపతాపాలు, ప్రేమాభిమానాలు, అభినందనలూ అవమానాలూ వంటి జీవితానుభవాలకు ప్రతీకగా అభివర్ణిస్తారు. ఉగాది పచ్చడికి అవసరమైన దినుసులు ప్రకృతిలోనే సహజసిద్ధంగా లభ్యమౌతాయి పక్వానికి వచ్చిన . చెరుకు గడ, చిన్ని నక్షత్రాల్లాంటి వేపచెట్టు పూలగుత్తి, టెంక కట్టని దశలో ఉన్న మామిడికాయ, కొత్త చింతపండు, ముప్పేట తిరిగిన కొబ్బరి, పక్కాగా పండిన అరటి, కొరికితే పిండైపోయే వేపిన శనగపప్పు.. వీటన్నింటినీ సరైన పద్ధతిలో సమపాళ్లలో కలిపితే తయారయ్యే ఉగాది పచ్చడిని హాయిగా ఆస్వాదించగలిగితే ఆ ఆనందమే వేరు. తీయతీయగా, పుల్లపుల్లగా, చేదుచేదుగా.... ఇంకే వంటకంలోనూ, ఆహార పదార్థంలోనూ తారసపడని అన్ని రుచులూ ఆస్వాదించడంలో మజాయే వేరు. తీపి కోసం చేదును స్వీకరించాలి. పులుపులోని పులకింత కోసం, వగరులోని పొగరునూ ఆహ్వానించాలి. గెలుపు కోసం ఓటమిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. రేపటి సుఖం కోసం నేడొక కష్టాన్ని భరించాల్సి ఉంటుంది. ఆరు రుచులు కలగలిసిన ఉగాది పచ్చడి మనకు బోధించే జీవిత పరమార్థం ఇదే!

శిశిరం తరువాత వసంత శోభ

ఉగాది వేళ పచ్చడిలోనే కాదు; ప్రకృతిలోనూ అలాంటి పాఠమే ఉంటుంది. శిశిరం సెలవు తీసుకొని, వసంతం ఆగమిస్తుంది. ఆకులు రాలిన కొమ్మల్లో లేలేత చివుళ్ళ తలెత్తుతాయి చిరుగాలుల తాకిడికి మిలమిల మెరుస్తూ ఎర్రెర్రని, లేలేత ఆకులు కనువిందు చేస్తాయి. చూస్తుండగానే మోడువారిన చెట్లు కొత్త ఆకుల గుబర్లతో కొంగొత్తగా నవనవలాడతాయి. శీతల రాత్రులు, మంచు కురిసే ఉదయాలూ - మాయం అయిపోతాయి. నులివెచ్చని సూరీడు ప్రకృతికి గోరువెచ్చని హాయిని ప్రసాదిస్తాడు. కొత్త గాలులు పల్లవిస్తాయి. శిశిరం, వసంతం మనిషి జీవితంలోని ఎగుడుదిగుళ్లకు సంకేతాలుగా నిలిచి, ఏ ఒక్కటీ శాశ్వతం కాదని జీవిత సత్యాన్ని చాటిచెబుతాయి.



ప్రకృతి నిండా వసంతగానం!

ఉగాది ఆగమనంలో ప్రకృతి పరవశిస్తుంది. జీవుల్లోనూ వసంతోత్సాహం వెల్లివిరుస్తుంది. గుబురు కొమ్మల్లో దాగి దాగి గండు కోయిల కుహూకుహూ గానం చేస్తుంది. మన సమాజం పూర్తిగా వ్యవసాయ ప్రధానంగా సాగినప్పుడు, ఉగాది కాలం తీరుబాటు సమయం. ముమ్మరమైన వ్యవసాయ పనుల నుంచి రైతులకుపుష్కలమైన విరామం దొరికే కాలం. ఆ విరామ తరుణంలో కుటుంబాల్లోని యుక్తవయస్కులకు పెళ్లిళ్లు..ఈ సందర్భాన ఇంటిముందూ, వీధుల్లో వేసే పెద్ద తాటాకు పందిళ్లు. ముమ్మందు ముదిరే వేసవి ఎండలకు చలువ పందిళ్ల. నేటి పరుగులెత్తే సమాజంలో ఇదికాస్తా క్రమం తప్పినా, నేటికీ పల్లెల్లో ఆ పరిస్థితులు సాక్షాత్కరిస్తూనే ఉన్నాయి.

రైతు సంతోషమే ...నిజమైన ఉగాది

పరమార్థాలను పక్కన పెట్టి, పర్వదినాలను జరుపుకుంటే అది వట్టి తంతు మాత్రమే అవుతుంది. రైతులు సంతోషంగా ఉంటేనే ఉగాది పండుగకు సార్థకత చేకూరేది. కానీ ఆ పరిస్థితి నేడు కానరావడం లేదు. సాగునీరు, పెట్టుబడి, ఎరువులు, మందులు, వాటి ధరలూ, దిగుబడి, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ వంటివన్నీ నేటి కాలపు అన్నదాతల అవసరాలు. వీటిని పంచాంగం తీర్చదు, ప్రభుత్వాలు పట్టించుకోవు.సరికదా రైతులను నిర్వాసితులను చేసి, పంటభూములను బడా కంపెనీలకు కట్టబెట్టటం మరొక విపరీతం. వీటిని అర్థం చేసుకొని, అడగగలిగిన, అడ్డుకోగలిగిన చైతన్యం రైతుల్లో రావాలి! రైతు శ్రమించి, వడ్డిస్తున్న వరిధాన్యాలనే మనం భుజిస్తున్నాం కాబట్టి, మనందరం అండగా నిలవాలి. అప్పుడే రైతుకు నిజమైన ఉగాది. దేశానికి బలమైన పునాది.

రాజకీయ పంచాంగ శ్రవణంపై సర్వత్రా ఆసక్తి

ఉగాది రోజున పచ్చడికి ఎంత ప్రాధాన్యం ఉందో పంచాంగ శ్రవణానికీ అంత ప్రాముఖ్యం ఉంది. కొత్త సంవత్సరంలో వానలు, పంటల పరిస్థితితోపాటు, వ్యక్తులు, రాజకీయ పార్టీలు పరిస్థితులు వంటివి పంచాంగకర్తలు ఉగాది రోజునే ముందస్తుగా వివరించి చెప్పడం, వాటిని ఆసక్తిగా ఆలించడం నేటికీ పరిపాటిగా మారింది. ఇక రాజకీయపార్టీల కార్యాలయాల్లో పంచాంగశ్రవణాన్ని ఒక వేడుకలా నిర్వహించడం, అక్కడ చెప్పే విషయాలన్నీ ఆయా పార్టీలకే అనుకూలంగా ఉంటూ, ఒకదానికొకటి పొంతన లేకుండా సాగడం చూస్తూనే ఉన్నాం. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న వేళ, శ్రీక్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణం మరింత ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. రాజకీయపార్టీల కార్యాలయాల వద్ద పంచాంగ శ్రవణాన్ని వినిపించే సిద్ధాంతులు, పండితులు, ఆయా పార్టీలకు అనుకూలంగానే చెబుతారనేది ముందుగా ఊహించే అయినప్పటికీ, ఏం చెబుతారో చూద్దామన్న ఆసక్తి అందరిలోనూ నెలకొని ఉంది.

సూపర్ సిక్స్ పథకాలపై కూటమి నేతల ప్రచారం

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని వీర నారాయణం, ముకుందపురం, పోతనపూడి, వీరవిల్లి గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై కూటమి నేతలు ప్రచారం నిర్వహించించారు. ఎస్సీ, ఎస్టీలకు, బీసీలకు 50 సంవత్సరాలకే వృద్ధాప్య పించను రూ.4000, వికలాంగుల పెన్షన్ రూ.6000 ఇస్తామని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేవుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు రాజ్ కుమార్, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు ఉండూరు రాజు, ప్రధాన కార్యదర్శి మట్టా చంటి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు శివాజీ, మండల ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న నాయకులు

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాకలపాడు సచివాలయం పరిధిలోని వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజాక్షేత్రంలో తమ వంతుగా ప్రచారం చేపడతామన్నారు. జోగుంపేట సచివాలయ పరిధిలో సాలిక మల్లవరం, పొగచెట్లపాలెం, వెంకటాపురం గ్రామాల వాలంటీర్లు రాజీనామా చేశారు.



రాజీనామా లేఖను ఇస్తున్న వాలంటీర్లు

పలు గ్రామాల్లో వాహన తనిఖీలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రావికమతం మండల కేంద్రంలో పోలీసులు విస్తతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. రావికమతం, తట్టబంద, కింతలి, కొత్తకోటకు వెళ్లే ప్రధాన రహదారుల వద్ద పోలీసులు ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీలు నిర్వహించారు.ఎన్నికల నిబంధనకు అనుగుణంగా నడుచుకోవాలని, కోడ్ ఉల్లంఘిస్తే కేసులు తప్పవని రావికముతమ్ ఎస్ఐ ధనంజయ నాయుడు తెలిపారు.

చీడికాడ: ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎన్నికల సంచార తనిఖీ విభాగం అధికారులు తనిఖీలు చేపట్టారు. గ్రామాల్లో మద్యం, నగదు, రవాణా నిరోధానికి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. స్థానిక పోలీసులు గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను చేపడుతున్నారు. మండలంలోని కోనాం చెక్ పోస్ట్ వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.



రావికమతంలో వాహనాలు తనఖీ చేస్తున్న పోలీసులు

15,16వ తేదీల్లో ఎన్నికలపై శిక్షణ

ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి

ప్రజాశక్తి-నక్కపల్లి: ఈనెల 15 ,16వ తేదీల్లో పిఒ, ఓపిఓలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే.గీతాంజలి తెలిపారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ, పాయకరావుపేటలోని శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్ స్కూలులో సుమారుగా 770 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బూత్ లెవెల్ అధికారులకు కూడా ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల అవుతుందని, అదే రోజు నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ఇందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజకీయ నేతలు పక్కాగా ఎన్నికల ప్రవర్తన నియామవళిని పాటించాలని సూచించారు.



అసత్య ప్రచారాలు తగవు

టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకష్ణారెడ్డి లాంటి వ్యక్తుల చేత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తూ, అబద్ధాలనే నిజమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం సంపద సృష్టించి పెరిగిన ఆదాయంతో ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేసిందని, అంతే తప్ప సంక్షేమం కోసం అప్పులు చేయలేదని, అభివృద్ధి కోసమే అప్పులు చేసిందని చెప్పారు. టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ వృద్ధులకు పెన్షన్ల విషయంలో శవ రాజకీయాలు చేస్తూ 33 మందిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.6 వేలు పింఛన్ ప్రకటన పట్ల హర్షం

ప్రజాశక్తి -అనకాపల్లి: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వస్తే వికలాంగులకు రూ.3వేలు పింఛన్‌ను రూ.6వేలుకు పెంచుతామని టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించడం పట్ల అనకాపల్లి టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక రింగ్ రోడ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ నెలకు రూ.6వేలు పింఛను పెంచడం ద్వారా కూటమి వికలాంగుల జీవితాల్లో వెలుగును నింపిందన్నారు. వికలాంగులు ఇక భయపడాల్సిన పని లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు వికలాంగులకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వారికి ఆపరేషన్లకు నిధులు కేటాయించామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మల్ల సురేంద్ర, షేక్ బాబర్, వికలాంగుల సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్చార్జ్ నాదముని ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధర్మశ్రీ ప్రోద్బలంతోనే బుచ్చిరాజు ట్రేడర్స్‌పై దాడులు

ప్రజాశక్తి- చోడవరం రూరల్ : చోడవరం వైసీపీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రోద్బలంతోనే కొన్ని రోజుల క్రితం స్థానిక బుచ్చిబాబు ట్రేడర్స్‌లో జిఎస్టీ అధికారులమంటూ వచ్చిన దాడులు చేశారని, ఈ విషయమై అధికారులను నిలదీసినందుకు తనపై తప్పుడు కేసు పెట్టారని అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ అన్నారు. చోడవరం పోలీస్ స్టేషన్లో 41 నోటీస్‌కు స్టేషన్ బెయిల్ తీసుకునేందుకు సోమవారం వచ్చిన రమేష్ స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ధర్మశ్రీ లాగా పంచాయితీ ప్లాన్ అప్రూవల్‌కి కూడా డబ్బులు వసూలు చేసే వ్యక్తిని కాదన్నారు. అసలు జిఎస్టీ రాష్ట్ర పరిధిలోనిది కాదని, కాని రెవెన్యూ ఇంటిలిజెన్స్ పేరుతో వైసీపీ ప్రభుత్వం ఒక కొత్త డిపార్ట్మెంట్‌ను సృష్టించి ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష సభ్యులను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టడానికి ఉపయోగిస్తుందని, దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.